క్లుప్తంగా

గుడుంబాను నిర్మూలించాలి



ఎస్సైకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామంలో విచ్చలవిడిగా నాటుసార విక్రయాలు జరుగుతున్నాయని, వెంటనే గుడుంబాను నిర్మూలించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినీల్ ఆధ్వర్యంలో మహిళలు ఎస్సై గణేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, గుడుంబా స్థావరాలతో ప్రతీ కుటుంబంలో ఘర్షణ వాతవరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శిరపు అప్పలరెడ్డి, కనుక రమాదేవి, పుల్లమ్మ భారతి, లక్ష్మి, వెంకట నరసమ్మ, సంపెల్లి వెంకటమ్మ, వల్లపాక భువమ్మ, కనుక రమణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్‌పై స్పష్టత ఇవ్వాలి

అశ్వాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యం బోనస్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ జన సమితి మండలాధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏ సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తారో దానికి సంబంధించిన ధాన్యం రకాలను ప్రకటించి రైతుల్లో నెలకొన్న అయోమయం పోగొట్టాల్సిన బాధ్యత ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వాపురం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 గంటల నుండి 10.30వరకు అశ్వాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చంద్రుగొండ: అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రుగొండ రేంజ్ ఆఫీసర్ ఎల్లయ్య తెలిపారు. ఆ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టం ప్రకారం ఇప్పటి వరకు అర్హులకు కేటాయించిన భూములను మినహాయించి మరింత వస్తుందని కొంత మంది రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లోకి చొచ్చుకు వస్తున్నారని, ఆయన చెప్పారు. అలాంటి ఆక్రమణలను సహించమన్నారు. రేంజ్ పరిధిలో ఇప్పటి వరకు ఉన్న 1,042 మందికి 1.677 ఎకరాల భూమిని పోడు దారులకు పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరమాచినేని వినీల్ కోరారు. శుక్రవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డితో సమావేశమై మండలంలో నెలకొన్న కరెంటు సమస్యలపై చర్చించారు. మండలంలో కరెంటు సమస్యలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, చిన్న వర్షం పడినా లో ఓల్టేజీ సమస్య ఇబ్బంది పెడుతుందన్నారు. త్రీఫేస్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిరపు అప్పల రెడ్డి, నటరాజ స్వామి, గడ్డం బాలాజీ, కెల్లా శేఖర్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వారం నగదు జమ చేయాలి



మాట్లాడుతున్న సాయన్న

దుమ్ముగూడెం : ఉపాధి హామీ కూలీల డబ్బులు ప్రతీ వారం ఖాతాలో జమ చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ సంఘం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తూరుబాక, ధర్మారం గ్రామాల్లో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలను ఆయన కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కరువు పనిలో మరింత కరువ చేేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. పని పూర్తయిన 15 రోజుల తర్వాత కొలతలు తీయటం సరైంది కాదని, కొలతలతో సంబంధం లేకుండా కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. వీరస్వామి, చిన్నయ్య, లక్ష్మయ్య, సుశీల, రాజమ్మ, నీలవేణి పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం..

పెద్దతోగు రోడ్డుకు వీడని గ్రహణం

- మూలుగుతున్న నిధులు..
- అటవీశాఖ అనుమతి లేక ముందుకు సాగని పనులు



అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిన పెద్దతోగు రోడ్డు

గుండాల: దూరం తక్కువే అయినా.. ప్రయాణం మాత్రం నరకప్రాయంగా మారింది ఆ గ్రామ ప్రజలకు. రోడ్డుకు నిధులు మంజూరు అయినప్పటికీ అటవీశాఖ అనుమతులు లేక పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవలే తమకు రోడ్డు కావాలని పార్లమెంట్ ఎన్నికలను గ్రామస్తులు బహిష్కరించగా స్థానిక అధికారులు సర్దిచెప్పి ఓట్లువేయించారు. ఎన్నికల సమయంలోనే తాము గుర్తొస్తామని, తర్వాత తమ బాధలను పట్టించుకోవడం లేదని మండలంలోని పెద్దతోగు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ అనుమతులు లేక..

గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారుల వెంట పడగా ఎస్‌టీఎస్‌డీఎఫ్ కింద 5.6 కి.మీల వరకు రూ. 4.16 కోట్లు మంజూరయ్యాయి. కాగా అటవీశాఖ అనుమతులు పనులు ముందుకు సాగడం లేదు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంలోనైనా తమ గ్రామానికి రోడ్డు పూర్తి చేయించాలని వేడుకుంటున్నారు.

రోడ్డు కావాలని ఎన్నికల బహిష్కరణ

తమ గ్రామానికి ఎన్నికల సమయంలో వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులే తప్పా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇన్నాళ్లు రోడ్డు కావాలని మొరపెట్టుకున్న గ్రామస్తులు చివరికి పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. దీంతో స్థానిక అధికారులు ఆ గ్రామానికి వెళ్లి తాము మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఓట్లు వేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని వేడుకుంటున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



బ్రిడ్జి లేక అధ్వానంగా ఉన్న వాగు

అడుగుకో గుంత.. మధ్యలో వాగు..

మండల కేంద్రం నుంచి 16కి.మీలో పెద్దతోగు గ్రామానికి ముత్తాపురం వరకు అర్‌అండ్‌బీ రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి పెద్దతోగు వరకు మట్టి రోడ్డు. అడుగడుగునా పెద్దపెద్ద గుంతలున్నా మరమ్మతులు సైతం చేపట్టడం లేదు. ఎండాకాలంలో ప్రయాణం ఏదోలా సాగించినా వర్షాకాలంలో మాత్రం ప్రయాణం ఓ నరకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలతో వరదలకు రోడ్డంతా కోతకు గురై అధ్వానంగా తయారైంది. కనీసం ద్విచక్ర వాహనం కూడా తిరగలేని పరిస్థితి. ఇక గ్రామం వద్ద వాగు వర్షం వస్తే దాటలేని పరిస్థితి. అత్యవసర సమయాల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తామని వాపోతున్నారు.

ఆరు కిలోమీటర్లు కాలినడకనే..



ఏ చిన్న అవసరం ఉన్నా ఆరు కిలోమీటర్లు కాలినడకన ముత్తాపురం వరకు వెళ్లాల్సిందే. ఇక వర్షాకాలంలో పడరాని పాట్లు పడుతున్నాం. పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల వెంట పడుతున్నా పట్టించుకోవడం లేదు.

-కల్తి కళ్యాణ్, పెద్దతోగు

ఎన్నికలొస్తేనే గుర్తుకొస్తాం



ప్రతీ ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికల సమయంలోనే తమ గ్రామం గుర్తొస్తుంది. ఆ ఓట్లు కూడా 15 కి.మీ.లు వెళ్లి వేయాలి. ఈ సారి ఓట్లు బహిష్కరిస్తే అధికారులే హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఫారెస్టు శాఖ అనుమతి వచ్చేలా చూడాలి.

- వాగబోయిన క్రిష్ణ, పెద్దతోగు

అటవీశాఖ నుంచి అనుమతి వస్తేనే పనులు

ముత్తాపురం–పెద్దతోగు వరకు 5.6కి.మీల వరకు నిధులు మంజూరు అయ్యాయి. అటవీశాఖ అనుమతులు లేవు. ఆ అనుమతుల కోసం లెటర్ పెట్టడం జరిగింది. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-ఐటీడీఏ ఏఈ శ్రీకాంత్

నాణ్యమైన విత్తనాలు అందించాలి



మాట్లాడుతున్న ఐలయ్య

ములకలపల్లి: నకిలీ విత్తనాలను అరికట్టి రైతులను నాణ్యమైన విత్తనాలను అందించాలని తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో శనివారం జరిగిన సంఘ మండలకమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందును విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా, అన్నదాతకు అందుబాటులో ఉంచాలన్నారు. అధిక వడ్డీలతో రైతుల నడ్డివిరుస్తున్న వ్యాపారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, వర్సా శ్రీరాములు, లక్ష్మీనర్సు, శనగాని వినోద్, శ్రీదేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీవీ కాలనీలో గస్తీ పెంచాలి

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తూ అధికశాతం నివాసం ఉంటున్న పీవీ కాలనీలో చోరీలు అధికమవుతున్న నేపథ్యంలో గస్తీ పెంచాలని కోరుతూ టీబీజీకేఎస్ ఇన్‌చార్జ్ నాగెల్లి వెంకట్ శుక్రవారం మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గస్తీ పెంచడంతో పాటు పోలీస్ కంట్రోల్ రూం పునరుద్ధరించి సిబ్బందిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ సానుకూలంగా స్పందించి రాత్రి సమయాల్లో గస్తీ పెంచుతామని హామీనిచ్చారన్నారు. రామాచారి, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, వినయ్ కుమార్, శ్రీనివాస్, రమేశ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలని, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను అందించాలని ఏపీపీ కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ కోరారు. శుక్రవారం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్ముల శ్రీరాములు, కంగాల భూలక్ష్మి, కారం మల్లేష్, గొంది లక్ష్మణరావు, కంగాల గోవింద్, ధర్ముల రాంబాబు, కొర్రి రాజు, వాసం జోగయ్య పాల్గొన్నారు.

పట్టభద్రులకు కృతజ్ఞతలు

అశ్వాపురం: ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించిన పట్టభద్రులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నకు ఓట్లు వేసిన పట్టభద్రులకు గెలుపుకు కృషి చేసిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాలొచ్చాయ్..!

- మండల విద్యా కేంద్రానికి చేరిన పాఠ్య పుస్తకాలు
- నేడు పంపిణీకి ఏర్పాట్లు



పుస్తకాలు దించుతున్న దృశ్యం

మణుగూరు టౌన్: 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమవనుండటంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన పుస్తకాలు అందించడంతో పాటు కల్పించాల్సిన అన్ని సౌకర్యాలపై మండల విద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పుస్తకాలు మండల కేంద్రానికి చేరగా, అమ్మ ఆదర్శ పాఠశాలలో వేగంగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన ప్రాథమిక పాఠశాలలన్నీ కలిపి 57 ఉండగా, 2,415 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. వారికి ప్రభుత్వం అందించే పుస్తకాలు శుక్రవారం మండల విద్యాశాఖఅధికారి వద్దకు చేరాయి.

నేడు పంపిణీ...

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధికార లెక్కల ప్రకారం 2,415 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, టెక్ట్ బుక్స్ 11,104, సింగిల్ రూల్డ్ నోట్‌బుక్స్ 2,110, తెల్ల కాగితాల పుస్తకాలు 6,701, మొత్తం 19,915 పుస్తకాలు శుక్రవారం చేరగా, వీటిని అన్ని పాఠశాలల బాధ్యులకు శనివారం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తులు ఎప్పటికప్పుడు పూర్తయిన వాటిని నేరుగా పాఠశాలలకు చేరే విధంగా ఏర్పాట్లు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా దాదాపు 25 పాఠశాలల్లో అన్ని సౌకర్యాల ఏర్పాటు పూర్తయ్యాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు తరగతుల వారీగా విభజించాం. అన్ని పుస్తకాలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పంపిణీ చేస్తాం. అమ్మ ఆదర్శపాఠశాలలో అధిక శాతం పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో చివరి దశకు చేరాయి. ఏకరూప దుస్తులు విద్యార్థులకు టైలర్ల దగ్గర నుంచే నేరుగా అందించే విధంగా చర్యలు తీసుకున్నాం.

- వీరాస్వామి, ఎంఈఓ

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకుని, ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన అన్నపురెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బోడా పద్మ కుమారుడు లక్ష్మణ్‌సాహిత్‌ను, కూతురు హిమవర్షిణిని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలో పర్యటించి, పలువురిని పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వర్లు, రాజా, వేణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి..

దమ్మపేట: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామస్తులు, గ్రామ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మండలంలోని గండుగులపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జారేను కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- విత్తన, ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



మణుగూరు రూరల్: తనిఖీ చేస్తున్న అబ్దుల్ బేగం



అన్నపురెడ్డిపల్లి: రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ తాతారావు

అన్నపురెడ్డిపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్నల్ స్క్వాడ్, మణుగూరు ఏడీఏ తాతారావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, గోడౌన్లను పరిశీలించారు. ఎరువులను డీబీటీ ద్వారానే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓలు ప్రశాంత్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: విత్తనాల విక్రయ దుకాణాల వద్ద విధిగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ఇంటర్నల్ స్క్వాడ్, మణుగూరు ఏడీఏ తాతారావు ఆదేశించారు. మండలకేంద్రంతోపాటు పూసుగూడెం, జగన్నాథపురం, చాపరాలపల్లి గ్రామాల్లోని షాపులను ఎంఏఓ కరుణామయితో కలసి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

మణుగూరు రూరల్: మండలంలోని పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారిణి అబ్దుల్ బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగులమందులకు సంబంధించి రికార్డులన్నీ నిశితంగా పరిశీలించడంతో పాటు స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని, ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను, ఎరువులను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామశివరావు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: అనుమతులు లేకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసగించినా వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అశ్వారావుపేట ఏడీఏ, టాస్క్‌ఫోర్స్ అధికారిణి అఫ్జల్ బేగం హెచ్చరించారు. ఈ మేరకు పినపాక, కరకగూడెం మండలాల్లోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం రేగళ్ల గ్రామంలో రైతులతో సమావేశమై సాగులో, విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్ ఏవో రామశివరావు, కరకగూడెం ఏఓ చటర్జీ, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు కొమరం లక్ష్మణరావు, రమేష్, ప్రశాంత్, అనిల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

దమ్మపేట: మండల పరిధిలోని పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గండుగులపల్లి గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరంతో పాటుగా డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యులు దివాకర్, తన సిబ్బందితో కలసి ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే చేస్తూ, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలి అని గ్రామస్తులకు సూచించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పరీక్షించి, సంబంధిత రక్త పరీక్షలు నిర్వహించారు. బాధితలకు తగిన మందులను ఉచితంగా పంపిణీ చేసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బషీరుద్దీన్, హెచ్ఈఓ సత్యనారాయణ, ఎంపీహెచ్ఏ హర్ష, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను చదువుకు దూరం చేయొద్దు..

గుండాల: పిల్లలను చదువుకు దూరం చేసి పనులకు పంపొద్దని, అన్ని సౌకర్యాలతో గుణాత్మక విద్యను అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఎంపీడీవో సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి పెండెకట్ల క్రిష్టయ్య అన్నారు. రెండో రోజు బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు.

అశ్వారావుపేటరూరల్: బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ జీ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బడిబాటపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నోడల్ అధికారి ప్రసాదరావు, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఎం హరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్పీలు, సీసీలు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని అంగన్‌వాడీ పాఠశాల పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: మండలంలోని కూనవరం గ్రామ పంచాయతీలో ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ.. ర్యాలీ చేశారు. ప్రధానోపాధ్యాయులు షేక్ మీరాహుస్సేన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఏనిక ప్రమీల, సభ్యులు ఉపాధ్యాయులు సారయ్య, ఆదినారాయణ, రత్నకుమార్, కృష్ణకుమారి, ఛాయాదేవి, క్లస్టర్‌హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ వీరకుమారి, ఆయా శశిరేఖ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ములకలపల్లి : బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బాలు, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఆర్ఐ తారాచంద్, ఐసీడీఎస్ సిబ్బంది, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు. తిమ్మంపేటలో హెచ్ఎం శంకర్ తదితరులు ఉన్నారు. .

దమ్మపేట: బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి, ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్ఎంలు, స్పెషల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలో బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలసి వారిని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. కరకగూడెం జెడ్పీ పాఠశాల హెచ్ఎం మంజులా, ఉపాధ్యాయులు లక్ష్మణ్, కవిత, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ములకలపల్లి : బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



అశ్వారావుపేటరూరల్: బడిబాట కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు



భద్రాచలంటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



గుండాల: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ



మణుగూరు రూరల్: కూనవరంలో..



దమ్మపేటలో..



కరకగూడెంలో..